


అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక

ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 363 | శుక్రవారం 19 డిసెంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-


## ఘనంగా సాయుధ దళాల
# జెండా దినోత్సవం



- ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్, హెూం మంత్రి అనిత
- భారత్ సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణ గల, ధైర్య సాహసాలతో కూడిన దళాలు.
- అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులు కూడా దేశ రక్షణ కోసం అప్రమత్తంగా ఉంటారు
- వర్షం, మంచు, వేడి, చలి ఏ పరిస్థితి వచ్చినా వెనకడుగు వేయరు
- మన సైనికులు కేవలం యుద్ధాల్లోనే కాకుండా భూకంపాలు, వరదలు, తుఫాన్లు కొండ చర్యలు విరిగినప్పుడు ముందుగా అక్కడికి చేరేది మన సాయుధ దళాలే

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

మాజీ సైనికుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై రూపొందించిన 'మన మార్గద ర్శి' పుస్తకాన్ని గౌరవ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి హెూం మంత్రి అనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెూం మంత్రి మాట్లాడుతూ..ఇది సాధారణ కార్యక్రమం కాదు. మన దేశానికి ప్రాణాలర్పించిన సైనికులను గుర్తు చేసుకునే రోజు. వారికి మనం కతజ్ఞతలు చెప్పుకునే - మిగతా3లో

## ఢిల్లీలో సీఎం
# బిజీ బిజీ

- నిధుల మంజూరు కోసం కేంద్ర మంత్రులతో సీఎం చంద్రబాబు వరుస భేటీలు
- జల్ జీవన్ మిషన్ అమలు కోసం అదనంగా రూ.1,000 కోట్లు ఇవ్వాలని వినతి
- ఈ ఆర్థిక సంవత్సరంలో సాస్కీ పథకం అమలుకు రూ.10,054 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి
- విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టులను ఆమోదించాలని వినతి
- సీఎం వెంట రాష్టానికి చెందిన పలువురు మంత్రులు, ఎంపీలు



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి న్యూ ఢిల్లీ**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు వివిధ ప్రాజెక్టుల కోసం నిధులు మంజూరు చేయాలని పలువురు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేంద్ర జల్ శక్తి శాఖా మంత్రి సీ.ఆర్.పాటిల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ అయి రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు, వివిధ పథకాలకు నిధుల విడుదలపై కేంద్ర జల్ శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చించారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో పాటిల్‌ను కలిసి పలు విజ్ఞప్తులు చేశారు. ప్రత్యేకించి విభజన హామీల్లో భాగంగా ఆమోదం పొందిన ప్రాజెక్టులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, పెండింగ్ అంశాలపై ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించాలని కోరారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి జల్ జీవన్ మిషన్ - మిగతా3లో

## ఏసు ప్రభువు శాంతిమార్గం.. త్యాగం, ప్రేమ, కరుణే

**%-% ఎస్సీల సంక్షేమం కోసం అదనంగా రూ 150 కోట్లు**

**%-% సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**(అంకుశం, నూజివీడు, డిసెంబర్ 19):**




నూజివీడు మంత్రివర్యులు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సెమీ క్రిస్టమస్ కు ప్రత్యేక అతిథిగా హాజరై ఫాదర్స్, మత పెద్దలకు, సోదర, సోదరీ మణులకు, కూటమి నాయకులకు, కార్యకర్తలకు రాష్ట్ర గహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి క్రిస్టమస్ శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు. మొదటిగా మంత్రికి ఘనంగా స్వాగతం పలికి చర్చి ఫాదర్స్, సిస్టర్స్ వాక్యం చదివిన అనంతరం కేక్ ను కట్ చేసి అందరికీ మంత్రి అందజేశారు. స్నేహ రైట్స్ బి.నగేష్ రావు ఆధ్వర్యంలో 30 మంది నిరుపేదలకు 17 రకాలు నిత్యవసర సరుకులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మునుపెన్నడు లేని విధంగా క్రిస్టియన్ సోదరులు అభివద్ధి, సంక్షేమానికి రూ 150 కోట్లు అదనంగా కేటాయించామని అన్నారు. జెరూసలేము యాత్రకు, విదేశీ విద్యను అభ్యచించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించామని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అందుకు కావలసిన నావంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. క్రై స్తవులు కుటుంబాలు మంచి ప్రేమ, ఆప్యాయతలు కలవారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్లు, సిస్టర్స్, చర్చి పెద్దలు ఇళయరాజా, రమేష్, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, క్రై స్తవ సోదర, సోదరీమణులు, తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు పేరిట జె.జె.ఎం.వాటర్ గ్రిడ్ పథకం
## డిప్యూటీ సీఎం పవన్

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**




ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో తాగునీటి పథకానికి 'అమరజీవి జలధార' పేరును ఖరారు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడించారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు పేరును అందరూ తలచుకొనేలా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు ఉద్దేశించిన జల్‌జీవన్ మిషన్ వాటర్ గ్రిడ్ పథకాన్ని రాష్ట్రంలో అమరజీవి జలధార అని వ్యవహరించనున్నట్టు తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన పోస్టర్‌ను డిప్యూటీ సీఎం విడుదల చేశారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులను శనివారం నిడదవోలు నియోజకవర్గం పెరవలి గ్రామంలో పవన్ శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5 ఉమ్మడి జిల్లాల పరిధిలో 5 ప్రాజెక్టులను ఈ పథకంలో భాగంగా చేపడుతున్నారు. ఉమ్మడి ప్రకాశం, చిత్తూరు, పల్నాడు, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని ఈ పథకం కోసం రూ.7,910 కోట్లు ఖర్చు చేయనున్నారు. రాబోయే 30 ఏళ్లలో 1.21 కోట్ల మంది దాహార్తి తీర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు

## స్కేటర్లకు క్రీడాశాఖ
## మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి అభినందనలు

**జాతీయ రోలర్ స్కేటింగ్‌లో విజయవాడ క్రీడాకారులకు పతకాలు పంట**



**(అంకుశం, అమరావతి, డిసెంబర్ 19):**

విశాఖ వేదికగా ఈ నెల 5 నుంచి 15 వరకు నిర్వహించిన 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో విజయవాడకు చెందిన అంచిత, దినేష్, దిరాజ్, తనుజ, తన్మయి పతకం సాధించడం అభినందనీయమని, క్రీడాకారులకు మంచి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన కోచ్ లు మహమ్మద్ ఖాజా, నాగుల్ మీరను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కొనియాడారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వీరిని అభినందించారు. రోలర్ స్కేటింగ్ అండర్ 18, 15, 12 విభాగంలో 1 బంగారు, 4 కాంస్య, 5 రజతం పతకాలు సాధించడం ప్రశంసనీయం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేలా ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కోచ్ లు మహమ్మద్ ఖాజా టీమ్,

## విశాఖ సీపీకి
## ప్రతిష్టాత్మక అవార్డు!

**సీపీ శంఖబ్రత బాగ్చిని అభినందించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**

**(అంకుశం, విశాఖపట్నం, డిసెంబర్ 19):**




ఇన్స్టెంట్ లోన్ యాప్ ఫ్రాడ్ కేసుని సాంకేతిక సాయంతో దర్యాప్తు చేసి 19 మంది ముద్దాయిలను అరెస్టు చేసినందుకు గాను విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చిని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా అభినందించారు. ఈ మేరకు ఆయనకు ప్రతిష్టాత్మకమైన అవార్డును అందజేశారు. నిందితుల వద్ద యూఎస్‌డీ అనే క్రిప్టో కరెన్సీ(వర్చువల్ డిజిటల్ కరెన్సీ) ని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి హార్డ్‌వేర్ వాలెట్ కు తరలించి, భద్రపరిచి తరువాత దానిని ఇండియన్ కరెన్సీ లోకి మార్పు చేసి లోన్ యాప్ బాధితులకు రిఫండ్ చేసినందుకుగాను ప్రెస్టీజియస్ ఏబిసిడి అవార్డు థర్డ్ ప్రైజ్ ను డీజీపీ నుంచి విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చితో పాటు సైబర్ క్రై మ్ సిబ్బంది అవార్డును అందుకున్నారు.

# కొత్త అధ్యక్షులపై లోకేష్ మార్క్




**విజయవాడ :** కూటమిలో ఆయనదే కీరోల్. ఏపీ సర్కార్‌ను నడిపించడంలో కూడా కీలక పాత్ర. తెలుగు దేశం పార్టీలో ఆయనే నంబర్ 2. అటు ప్రభుత్వంలో, ఇటు పార్టీలో కీలక వ్యవహారాలన్నీ లోకేశ్ చక్కబెడుతున్నారు. ఈ క్రమంలో లేటెస్ట్‌గా టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం ఆసక్తికరంగా మారింది. 26 జిల్లాలకు అధ్యక్షులను ఖరారు చేశారు. రాష్ట్ర కార్యవర్గం కూర్పును పూర్తి చేశారు. ఇప్పటికే ఖరారు చేసిన 26 మంది ఎంపిక సమయంలో పార్టీ త్రిసభ్య కమిటీ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌తో చర్చించినట్లు తెలుస్తోంది. అయితే టీడీపీ జిల్లా రథసారధుల లిస్ట్‌ను చూస్తే ఎక్కువగా కొత్తవారే ఉన్నారు. ఇందులో ఎక్కువ మంది లోకేశ్ టీమ్‌లోని కీలక లీడర్లుగా చెబుతున్నారు. జిల్లా అధ్యక్షుల నియామకంలో క్యాస్ట్ ఈక్వేషన్స్‌కు, సీనియారిటీకి ప్రయారిటీ ఇవ్వడంతో పాటు యువనేతలకు ప్రాధాన్యం ఇచ్చింది టీడీపీ హైకమాండ్. కొత్తగా అధ్యక్ష బాధ్యతలు తీసుకోబోయేవారిలో సీనియర్ లీడర్లు, మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మన్ గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, కొమ్మాలపాటి శ్రీధర్, పిల్లి మాణిక్యాలరావు, బీద రవిచంద్ర, సుగవాసి ప్రసాద్ ఉన్నారు. సేమ్‌టైమ్ యువతకు కూడా అదే స్థాయిలో ప్రయారిటీ ఇచ్చారు. కిమిడి నాగార్జున, మోజోరు తేజోవతి, పట్టాభిరామ్, కోట్ని బాలాజీ, జ్యోతుల నవీన్, బొడ్డు వెంకటరమణ చౌదరి, గుత్తల సాయి, సలగల రాజశేఖర్, ఎంఎస్ రాజు, సి.భూపేష్ రెడ్డి వంటి వారు 40 నుంచి 50 ఏళ్ల మధ్యలోపు వారే. వీరంతా లోకేశ్ టీమ్‌గానే చెబుతున్నారు.లోకేశ్ టీమ్ అంటే అంతా యువనేతలే. పార్టీ రాష్ట్ర కార్యవర్గంలోనూ యంగ్ లీడర్లు..దూకుడుగా పనిచేసే నాయకులే ఉన్నారు. అయితే 26 జిల్లా అధ్యక్షుల్లో పదికి పైగా జిల్లాలకు పార్టీ పగ్గాలు..యువ నేతలకు ఇచ్చారు. అయితే ఈ క్రమంలో వైజాగ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో లోకేశ్ చేసిన కామెంట్స్ చర్చకు దారి తీస్తున్నాయి. యువ నాయకులంతా మిస్సైల్స్‌లాగా పనిచేస్తుంటే..సీనియర్ లీడర్లు జీపీఎస్‌లాగా డైరెక్షన్స్ ఇస్తున్నారని చెప్పారు లోకేశ్‌అంటే యువ నేతలంతా మిస్సైల్స్ లాగా దూసుకెళ్తుంటే ..సీనియర్ లీడర్లు జీపీఎస్ లాగా దారి చూపుతున్నారని చెప్పడం ఆసక్తికరంగా మారింది. ఏ మిస్సైల్ టార్గెట్‌ను చేజ్ చేయాలన్నా జీపీఎస్ మస్ట్ అన్నారు లోకేశ్. ఏపీ అభివృద్ధికి యువనేతలంతా మిస్సైళ్లలా పనిచేస్తుంటే..సీనియర్ నాయకులు జీపీఎస్‌లా మార్గదర్శకత్వం చేస్తున్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు, అశోక్ గజపతిరాజు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు జీపీఎస్‌లైతే..కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలు, తాను మిస్సైళ్లమని స్పష్టం చేశారు. అదే వేదికపై సీనియర్ లీడర్లు కూడా లోకేశ్‌కు ఎలివేషన్ ఇవ్వడం మరింత ఇంట్రెస్టింగ్ డిస్కషన్ అవుతోంది.యువగళం పాదయాత్రకు ముందు లోకేశ్‌ను చాలామంది లీడర్‌గా యాక్సెప్ట్ చేయని పరిస్థితి. అదే లోకేశ్‌ను ఇప్పుడు ఫ్యూచర్ లీడర్‌గా..ఇక చిన్నబాబే తమ పార్టీ అధినేత అన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తమ వారసులను కూడా లోకేశ్ వెంట నడిచేలా ప్రోత్సహి స్తున్నారు టీడీపీ లీడర్లు. దీంతో టీడీపీలో టీమ్ లోకేశ్ కీరోల్ అయిపోయింది. ఇష్యూ ఏదైనా..పార్టీలో ఏ చిన్న పాబ్లమ్ ఉన్నా ఇట్టే సమసిపోయేలా చేయడంతో పాటు..నో డౌట్స్, నో కన్‌ఫ్యూజన్స్..వీఆర్ వన్ అనే ఇండికేషన్స్ పంపిస్తున్నారు. టీడీపీని మరో ముప్పై ఏళ్లు పవర్ ఫుల్ పార్టీగా ఉంచేలా..యంగ్ టీమ్‌ను ఎంకరేజ్ చేస్తున్నారు. సేమ్‌టైమ్ ఇప్పటివరకు ముప్పై ఏళ్లుగా పార్టీకి అండగా, పునాదుల్లా నిలిచిన నేతలను కూడా అదే స్థాయిలో గౌరవిస్తున్నారు. సలహాలు, సూచనలు మీవి..దూకుడుగా పనిచేసేది తామంటూ యువనాయకులతో స్ట్రాంగ్ ఫోర్స్‌గా నిలబడుతున్నారు లోకేశ్. ఈ స్ట్రాటజీ టీడీపీకి ఫ్యూచర్ బేస్డ్‌గా ఎంతో యూజ్ అవుతుందని..లోకేశ్ పనితీరు పార్టీకి రోజురోజుకు హైప్ తీసుకొస్తుందని అంటున్నారు తెలుగు తమ్ముళ్లు.

# పర్యాటక శాఖ పరిధిలోకి రుషికొండ ప్యాలెస్



**విశాఖపట్టణం :** గత వైసీపీ ప్రభుత్వంలో కోట్లు ఖర్చు పెట్టి వైజాగ్‌లో నిర్మించిన రిషికొండ భవనాన్ని టూరిజం శాఖకు ఆదాయం తెచ్చేలా డెవలప్ చేస్తామన్నారు ఏపీ మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి. రుషికొండ ప్యాలెస్‌ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై నిర్ణయం తీసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో వీరు సభ్యులు.గత ప్రభుత్వం అధునాతనంగా నిర్మించిన రిషి కొండ ప్యాలెస్ ఖర్చు 500 కోట్లు అంటూ అప్పటి విపక్షాలైన టీడీపీ, జనసేన పదే పదే ఆరోపించాయి. అయితే తాము అధికారంలోకి వచ్చాక ఆ భవనాన్ని ఎలా వాడాలి అన్నది అర్థం కావడం లేదు అన్నట్టు చెప్పుకొచ్చారు. ప్రతీ నెలా దాని నిర్వహణ ఖర్చు ప్రభుత్వానికి భారంగా మారింది. అందుకే రిషి కొండ ప్యాలస్‌ని ఏం చెయ్యాలి అనే దానిపై చర్చించడానికి మంత్రుల కమిటీ వేసింది ప్రభుత్వం. వారి భేటీ వెలగపూడి సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయస్వామి, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి పాల్గొని సుదీర్ఘంగా చర్చించారు గత భేటీలో సూచనల మేరకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని పర్యాటక శాఖ అధికారులు సబ్ కమిటీ ముందుంచారు. రుషికొండ ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై వెబ్ సైట్ లో స్పందన కోరగా 1517 మంది ప్రజలు, 44 మంది స్టేక్ హోల్డర్స్ అభిప్రాయం వ్యక్తం చేశారని అత్యధిక శాతం ప్రజలు గత ప్రభుత్వం చేసిన తప్పును త్వరితగతిన సరిదిద్ది ప్రజలకు ఉపయోగపడేలా చేయాలని కోరారని వెల్లడించారు. మరికొందరు హోటల్, రిసార్ట్, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ, సైన్స్ ప్లానిటోరియం, మైస్, వెల్ నెస్ సెంటర్ గా, ప్రభుత్వ కార్యాలయంగా వినియోగిస్తే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సబ్ కమిటీ వెల్లడించింది. అంతిమంగా సంస్థల సమర్థతను పరిగణలోకి తీసుకొని ప్రజలకు ఉపయోగపడుతూనే, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టేలా రుషికొండ ప్యాలెస్ ను వినియోగించేలా నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ఫలక్ నామా ప్యాలెస్ కట్టడాన్ని సహజత్వం కోల్పోకుండా ఏ విధంగా వినియోగిస్తున్నారనే అంశాన్ని ఉదహరించారు.మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, డోలా బాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ గత ప్రభుత్వం రుషికొండపై పర్యాటక శాఖకు అధిక ఆదాయాన్నిచ్చే హరిత రిసార్ట్స్ స్థానంలో విజయనగర, కళింగ, చోళ, పల్లవ, గజపతి, వేంగి, ఈస్టర్స్ గంగ తదితర పేర్లతో కూడిన 7 బ్లాక్ లతో 19,968 చదరపు మీటర్లలో రాజప్రాసాదం లాంటి ప్యాలెస్ ను నిర్మించి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని విమర్శించారు. గత ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్రస్తుతం ప్రతి నెలా 25-30 లక్షల మెయింటెనెన్స్ చార్జీల భారం పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు, స్టేక్ హోల్డర్స్ అభిప్రాయాన్ని తీసుకున్నామని త్వరలోనే దీన్ని పర్యాటక శాఖకు ఆదాయం వచ్చేలా, ప్రజలకు కూడా ఉపయోగపడేలా సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే టాటా, అట్మోస్ఫియర్ కోర్, ఐహెచ్ సీఎల్, హెచ్ఈఐ తదితర సంస్థలు ప్యాలెస్ ను ఏ విధంగా వినియోగిస్తే బాగుంటుందో తమ అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లిబుచ్చాయని, మరికొన్ని విదేశీ సంస్థలు కూడా అభిప్రాయాన్ని వ్యక్తం చేశాయన్నారు. కొన్నింటికి పూర్తిస్థాయి స్పష్టం రావాల్సి ఉందన్నారు. మరో భేటీకి పూర్తి స్పష్టత వస్తుందని అనంతరం రెండు మూడు ప్రతిపాదనలు కేబినెట్ దృష్టికి తీసుకెళ్లి ఆ తర్వాత సీఎం చంద్రబాబునాయుడు సూచనల మేరకు తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సాధ్యమైనంత త్వరగా మరోసారి భేటీ అయి రుషికొండ ప్యాలెస్ పై కీలక నిర్ణయం తీసుకుంటామని సబ్ కమిటీ పేర్కొంది. సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు రుషికొండ ప్యాలెస్ కు సంబంధించిన ప్రజెంటేషన్ ఇచ్చారు.

# సిమలో సైలెంట్ వేవ్...

**కర్నూలు :** రాయలసీమలో వైసీపీ క్రమంగా పుంజుకునట్లు కనిపిస్తుంది. కూటమి పార్టీ నేతల్లో విభేదాలతో పాటు వైసీపీ పట్ల సానుకూలత ఒకరకంగా వైసీపీకి వచ్చే ఎన్నికల్లో కలసి వచ్చే అంశంగా కనిపిస్తుంది. రాయలసీమలో మొత్తం యాభై రెండు శానససభ నియోజకవర్గాలున్నాయి. అయితే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై తీవ్ర వ్యతిరేకత ఎదురవుతుండటంతో పాటు పంటలకు సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో పాటు రాజధాని అమరావతికే తెచ్చిన రుణాలన్నీ పెడుతున్నారన్న ప్రచారం కూడా కూటమి పార్టీలకు ఇబ్బందికరంగా మారిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. గత ఎన్నికల్లో ఒక ఊపు ఊపిన కూటమి ఈసారి మాత్రం కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు నెలకొన్నాయని ఖచ్చితంగా చెప్పాలి. అందులోనూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల ప్రభావం కూడా కూటమి పై ప్రతికూలత చూపుతుందని అంటున్నారు.గత ఎన్నికల్లో కర్నూలులో పథ్నాలుగు స్థానాలుంటే రెండు స్థానాల్లో మాత్రమే వైసీపీ గెలిచింది. అది కూడా ఆలూరు, మంత్రాలయంలో మాత్రమే ఫ్యాన్ పార్టీ గలిచింది. ఆదోనిలో బీజేపీ, మిగిలిన పదకొండు నియోజకవర్గాల్లో టీడీపీ విజయం సాధించింది. అనంతపురం జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే కూటమి గత ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ధర్మవరంలో మాత్రం బీజేపీ గెలిచింది. మిగిలిన పదమూడు చోట్ల టీడీపీ అభ్యర్థులు విజయం సాధించారు. కడపలో పది నియోజకవర్గాలుంటే అందులో మూడింటిలో వైసీపీ మిగిలిన చోట్ల టీడీపీ, జనసేన, బీజేపీ గెలుచుకున్నాయి. వైసీపీ బద్వేలు, కడప, మైదుకూరుల్లో మాత్రమే గెలిచింది. ఇక చిత్తూరు జిల్లాలో పథ్నాలుగు నియోజకవర్గాలుంటే రెండింటిలో మాత్రమే వైసీపీ గెలిచింది. తంబళ్లపల్లి, పుంగనూరులో వైసీపీ గెలుపొందగా తిరుపతిలో జనసేన గెలిచింది.ఇప్పటికే కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో పరిస్థితులు మారాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఇక్కడ కూటమి నేతలు యాక్టివ్ గా లేకపోవడంతో పాటు వైసీపీ నేతలు క్రమంగా బలం పుంజుకుంటున్నట్లు కనపడుతుంది. ఇక వచ్చే ఏడాది ప్రారంభంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వైసీపీ మరింత బలపడే అవకాశాలున్నాయని అంటున్నారు. వేవ్ ఇప్పుడు సీమ జిల్లాల్లో మారిందన్నది నిఘా వర్గాలు కూడా ప్రభుత్వానికి అందించినట్లు సమాచారం. ప్రజల్లో అధికార పార్టీపై ఎప్పుడూ అసంతృప్తి ఉంటుంది. అది ప్రతిపక్ష పార్టీకి కొంత అనుకూలంగా మారుతుంది. మరొకవైపు జగన్ ను సీమ ప్రాంత వాసిగా చూడటంతో మరికొంత ప్లస్ అయిందని అంటున్నారు. మరి చివర వరకూ ఇదే పరిస్థితి కొనసాగితే మాత్రం రాయలసీమలో కూటమికి కష్టాలు.. వైసీపీకి వేవ్

## ఢిల్లీలో సీఎం బిజీ బిజీ

-మొదటిపేజీ తరువాయి

అమలు కోసం రాష్ట్రానికి అదనంగా రూ.1,000 కోట్లు కేటాయించాలని విన్నవించారు. జల్ జీవన్ మిషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.524.41 కోట్లు ఖర్చు చేశామని, అలాగే దీనికి సంబంధించిన కేంద్ర వాటా నిధులను కూడా విడుదల చేయాలని సీఎం కోరారు. అదేవిధంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి పూర్వోదయ, సాస్కీ పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్ కు చేయూత ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా తీర్చిదిద్దేందుకు వచ్చే బడ్జెట్ లో నిధులు కేటాయించాలని కోరిన ముఖ్యమంత్రి కరవు పీడిత ప్రాంతాల దాహార్తిని తీర్చేందుకు, సాగునీటి అవసరాల కోసం గోదావరి వరద జలాల మళ్లింపు కోసం చేపట్టే పోలవరం%-% నల్లమల సాగర్ ప్రాజెక్టుకు చేయూత అందించాలని సీఎం విజ్ఞప్తి. సాస్కీ కింద మంజూరైన వివిధ ప్రాజెక్టులను సత్వరం చేపట్టాలని కేంద్ర మంత్రికి విన్నవించిన సీఎం. విశాఖలో యూనిటీమాల్ నిర్మాణం, అఖండ గోదావరి కింద చేపట్టిన హావ్ లాక్ బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు, గండికోట పర్యాటక ప్రాజెక్టుతో పాటు రాష్ట్రంలో మూడు వర్కింగ్ విమెన్ హాస్టళ్ల నిర్మాణాల పూర్తికి నిధులివ్వాలని కోరిన సీఎం. 2025%-%26 ఆర్థిక సంవత్సరంలో ఈ పనులకు గానూ రూ.10,054 కోట్లు సాస్కీ కింద మంజూరు చేయాలని కోరిన ముఖ్యమంత్రి. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, జలరవాణా మంత్రి సర్బానంద సోనోవాల్‌ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిశారు. ఈ సందర్భంగా దుగరాజపట్నం షిప్‌బిల్డింగ్ క్లస్టర్, ఫిషింగ్ హార్బర్లకు కేంద్ర సాయంపై సోనోవాల్‌తో చర్చించిన సీఎం చంద్రబాబు. దేశంలో నౌకాశ్రయాలు, నౌకా నిర్మాణ రంగ అభివద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానాలకు కతజ్ఞతలు తెలిపిన సీఎం చంద్రబాబు. "చిప్ టు షిప్" విజన్‌కు అనుగుణంగా షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయాలని వినతి. కేంద్ర గహ నిర్మాణం, పట్టణాభివద్ధి వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విశాఖ, విజయవాడలో మెట్రో రైలు ప్రాజెక్టులను ఆమోదించాలని కేంద్ర మంత్రిని కోరిన సీఎం. సీఎం చంద్రబాబు వెంట ఎంపీలు సానా సతీష్ బాబు బైరెడ్డి శబరి పార్థసారథి మాగంటి శ్రీనివాసులు రెడ్డి ఇతర పార్లమెంటు రాజ్యసభ సభ్యులు ఉన్నారు

## పెట్టుబడులపై వైసీపీ కుట్ర

**రాజమండ్రి :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం) రాజమండ్రిలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. రాజమండ్రి ఆర్ట్స్ కాలేజీలో నూతన భవనాలను ప్రారంభించారు. అలాగే, కాలేజీలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో నూతన భవనాలను ప్రారంభించారు.

జగన్ అండ్ కో కుట్ర చేస్తున్నారు.. ఈ సందర్భంగా ప్రసంగించారు మంత్రి నారా లోకేశ్. ఐటీ పెట్టుబడులు, యువత ఉద్యోగాలపై జగన్ అండ్ కో కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. యువత భవిష్యత్‌పై ద్వేషంతోనే జగన్ ఈ పని చేస్తున్నారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఇప్పటికే పలు ఐటీ సంస్థలపై వైసీపీ పిల్ వేసిందని ప్రస్తావించారు. ఇటీవల రహేజా ఐటీ పార్క్‌పైనా పిల్ వేశారని ఫైర్ అయ్యారు. ఐటీ ప్రాజెక్టులతో యువతకు లక్షకు పైగా ఉద్యోగాలు వస్తాయని స్పష్టం చేశారు. రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా జగన్ పనిచేస్తున్నారని మండిపడ్డారు మంత్రి నారా లోకేశ్.

యువత భవిష్యత్‌పై జగన్‌కు ఇంత ద్వేషం ఎందుకు..? అని ప్రశ్నించారు. ఏపీకి వచ్చే పెట్టుబడులు, ఉద్యోగాలను అడ్డుకోవాలనే ఆలోచనా సబబా..? అని నిలదీశారు. విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోకూడదని ధైర్యం చెప్పారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించే శక్తి దేవుడు ఇస్తారని తెలిపారు. తాను ఏ తప్పు చేసినా అమ్మ కొట్టేవారని గుర్తుచేశారు. ఇప్పటి పరిస్థితుల్లో ఒకవేళ ఏదైనా తప్పు చేస్తే అమ్మ తిట్టినా మనం బాధపడకూడదని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

ఎవరికి ఎప్పుడు ముహూర్తం పెట్టాలో నాకు తెలుసు: నారా లోకేశ్

చట్టాన్ని ఉల్లంఘించి గతంలో అక్రమాలకు పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, ఎవరికి ఎప్పుడు ముహూర్తం పెట్టాలో తనకు బాగా తెలుసని ఏపీ మంత్రి నారా లోకేశ్ హెచ్చరించారు. ఈరోజు రాజమండ్రిలో జరిగిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. టీడీపీని భూస్థాపితం చేస్తామన్న వారి కలలు నెరవేరలేదని, ఎన్టీఆర్ స్థాపించిన ఈ పార్టీ మరో వందేళ్లు బలంగా నిలబడుతుందని ధీమా వ్యక్తం చేశారు.

టీడీపీలో 'అలక' అనే ఒక జబ్బు ఉందని, దానిని వీడాలని కార్యకర్తలకు సూచించారు. "ఎమ్మెల్యేపై అలగడం కంటే, ఆయనతో పోరాడాలి. నాలుగు గోడల మధ్య తప్పులను సరిదిద్దాలి" అని హితవు పలికారు. మంగళగిరి, రాజమండ్రి నియోజకవర్గాలు టీడీపీకి కంచుకోటలని, ఇక్కడ పార్టీని ఓడించడం ఎవరి తరమూ కాదని ఆయన స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆదిరెడ్డి వాసు, ఆయన తండ్రి ఆదిరెడ్డి అప్పారావును అన్యాయంగా జైల్లో పెట్టి వేధించారని లోకేశ్ ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా అప్పటి ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీని, నా తల్లిని కూడా అవమానించారు, ఆ విషయాలన్నీ నేను గుర్తుంచుకున్నాను అని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబును 53 రోజుల పాటు అక్రమంగా జైలులో నిర్బంధించినప్పుడు రాజమండ్రి కార్యకర్తలు తమ కుటుంబానికి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల త్యాగాల వల్లే కూటమి 164 స్థానాల్లో చారిత్రక విజయం సాధించిందని కొనియాడారు. ఈ కార్యక్రమం అనంతరం పార్టీ కోసం కష్టపడిన కీలక కార్యకర్తలను లోకేశ్ సత్కరించి, వారి నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

## ఘనంగా సాయుధ దళాల జెండా దినోత్సవం

-మొదటిపేజీ తరువాయి

రోజు. భారత్ సాయుధ దళాలు ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణ గల, ధైర్య సాహసాలతో కూడిన దళాలు. మన సైనికుల బలం కేవలం ఆయుధాల్లో కాదు. వారి ధైర్యం త్యాగం ఎటువంటి పరిస్థితుల్లోనైనా విధులు నిర్వహిస్తారు. అత్యంత కఠిన వాతావరణ పరిస్థితులు కూడా దేశ రక్షణ కోసం అప్రమత్తంగా ఉంటారు. వర్షం, మంచు, వేడి, చలి ఏ పరిస్థితి వచ్చినా వెనకడుగు వేయరు. మన సైనికులు కేవలం యుద్ధాల్లోనే కాకుండా భూకంపాలు, వరదలు, తుఫాన్లు కొండ చర్యలు విరిగినప్పుడు ముందుగా అక్కడికి చేరేది మన సాయుధ దళాలే. మన దేశ ప్రజలు ప్రశాంతంగా జీవించగలుగుతున్నామంటే దానికి కారణం మన సైనికులు త్యాగమే. చాలామంది సైనికులు సంవత్సరాల తరబడి తమ కుటుంబాలకు దూరంగా ఉంటారు. కొంతమంది సైనికులు దేశం కోసం తమ ప్రాణాలు సైతం త్యాగం చేశారు. ప్రాణాలర్పించిన సైనికుల కుటుంబాలు, యుద్ధంలో గాయపడిన సైనికులు వారు ఎంతో ధైర్యంగా జీవితం ముందుకు తీసుకెళ్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సైనిక్ సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, 10 కోట్ల కార్పస్ నిధిని కేటాయించింది. జూన్ 2024 నుండి ఇప్పటివరకు మరణించిన రక్షణ సిబ్బంది కుటుంబాలకు చెందిన అర్హులైన ఆధారితులకు మొత్తం 13 కారుణ్య నియామకాలు చేశామని తెలిపారు. దేశ రక్షణలో సేవలందించిన పలువురిని సత్కరించడంతో పాటు, సాయుధ దళాల పతాక దినోత్సవ విరాళాలు అత్యధికంగా సేకరించిన కలెక్టర్లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారులను గవర్నర్ అబ్దుల్ నజీర్ సత్కరించారు.

## స్వర్ణగ్రామాలుగా సచివాలయాలు

**విజయవాడ :** ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఏపీలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను మారుస్తూ నిర్ణయం తీసుకున్నారు. వాటి పేర్లను స్వర్ణగ్రామం శాఖగా మార్చునునట్లు ప్రకటించారు. కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు ఈ ప్రకటన చేశారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు జారీ అవుతాయని తెలిపారు. ఒకటి లేదా లేదు రోజుల్లో దీనికి సంబంధించి జీవో జారీ చేసే అవకాశముందని తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిల్లో చాలా మార్పులు చేస్తుండగా.. ఇప్పుడు పేరును మార్చడం చర్చనీయాంశంగా మారింది.అమరావతిలోని సచివాలయంలో బుధవారం కలెక్టర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా వాటి పేరును స్వర్ణగ్రామంగా త్వరలో మార్చుతున్నట్లు చంద్రబాబు స్పష్టతిచ్చారు. వీటి పేరును మార్చుతారనే ప్రచారం ఎప్పటినుంచో జరుగుతోంది. స్వర్ణంధ్ర విజన్-2047లో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాను విజన్ యూనిట్లుగా ఉపయోగించుకోవాలని గతంలో చంద్రబాబు సూచించారు. విజన్ సాధించడంలో వీటి పాత్ర కీలకమని తెలిపారు. ఆ విజన్‌లో భాగంగా రాష్ట్రాభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారుచేశారు.ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చడం హాట్‌టాపిక్‌గా మారింది.గ్రామ స్థాయిలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.


# దేశానికి, మా ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదములు సీఎం

**- సీఎం చంద్రబాబుకు, లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కు బ్రిక్స్ 11 వ సమావేశం ఆల్బమ్ అందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**

**అంకుశం న్యూస్ కర్నూల్ డిసెంబర్ 19:** భారత దేశానికి, మా ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు కల్పించినందుకు ప్రత్యేక ధన్యవాదములు సార్ అంటూ న్యూ ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడకు, లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కు బ్రిక్స్ 11 వ శిఖరాగ్ర సమావేశం ఆల్బమ్ ను నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అందించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ బ్రెజిల్ (బ్రాసీలియా) లో నిర్వహించిన 11వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ పుస్తకాన్ని

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ పుస్తకంలో బ్రెజిల్‌లో జరిగిన 11 వ బ్రిక్స్ సమావేశాల్లో నేను పాల్గొన్న ఫోటోలు, ప్రసంగాలు, చర్చలు పొందుపరచడం అద ృష్టంగా, గర్వకారణంగా, అపార


పార్లమెంట్ భవనం ముందు టీడీపీ ఎంపీలతో సీఎం చంద్రబాబు గ్రూప్ ఫోటో



న్యూ ఢిల్లీలో లోక్ సభ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా కు బ్రిక్స్ 11 వ శిఖరాగ్ర సభ ఆల్బమ్ ను అందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

గౌరవంగా, అనుభవంగా భావిస్తున్నానని, ప్రపంచ స్థాయిలో మహిళా సాధికారత, కృత్రిమ మేధస్సు (AI), వాతావరణ మార్పు, ప్రజాస్వామ్య విలువలు వంటి కీలక అంశాలపై జరిగిన చర్చల్లో భారతదేశం తరపున స్వరం వినిపించడం నిజంగా ఆనందాన్ని ఇచ్చిందని, భారత దేశానికి, మా ప్రజలకు సేవ చేసే ప్రతి అవకాశం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కల్పించడం ఆనందంగా ఉందని, బాధ్యతతో పనిచేస్తున్నానన్న సంత ృప్తి ఇస్తుందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# రాప్తాడు అభివృద్ధికి నిధులు ఇవ్వండి

**- రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రులను కలిసిన పరిటాల సునీత**

**- మంత్రులు ఆనం, నిమ్మల, అనగానితో పాటు పలు శాఖలకు విజ్ఞప్తులు**

**- పంపనూరు, పండమేరు ఆలయాల అభివృద్ధికి నిధులు కావాలి**

**- పేరూరు ప్రాజెక్టుకు భూములిచ్చిన రైతులకు పరిహారం ఇవ్వండి**

**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 19:** రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే పరిటాల సునీత పలువురు రాష్ట్ర మంత్రులను కలిశారు. అమరావతిలోని మంత్రులు, అధికారుల కార్యాలయాలకు వెళ్లి పలు అంశాలపై విజ్ఞప్తి చేశారు. ముందుగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని గ్రామస్థులు, అధికారులు, ఆలయాల కమిటీ సభ్యులతో పాటు వెళ్లి అభివృద్ధికి సంబంధించిన వినతి పత్రాలు అందజేశారు. ఆత్మకూరు మండలం పంపనూరు దేవస్థానం రాజుల కాలంలో నిర్మించబడిందని.. గతంలో కొన్ని సందర్భాల్లో ఆలయ అభివృద్ధి జరిగినప్పటికీ, అవి వాస్తు శాస్త్రం మరియు వైదిక స్మార్త ఆగమ సంప్రదాయం ప్రకారం జరగలేదన్నారు. ఆలయానికి సర్వే నం. 488లో 3-92 సెంట్ల భూమి ఉన్నప్పటికీ, ప్రతి ఆదివారం మరియు శుభదినాలలో వచ్చే భారీ భక్తుల రద్దీకి ప్రస్తుత నిర్మాణాలు సరిపోవడం లేదన్నారు. అందువలన ప్రతిపాదిత ఆలయ పునర్నిర్మాణానికి సీజీఎఫ్ నిధులు పొందటానికి, అభివృద్ధి పనులకు సుమారు 12 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. రాప్తాడు మండలం పండమేటి వెంకటరమణ స్వామి



దేవస్థానం అభివృద్ధికి సుమారు 3 కోట్ల నుంచి 6 కోట్ల నిధులు మంజూరు చేయాలని కోరారు. శ్రీదేవి, భూదేవి దేవాలయాలు నిర్మాణం, ఫ్లోరింగ్, మండపం నిర్మాణానికి నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు నియోజకవర్గంలోని 6 మండలాలలో భజన మందిరాల నిర్మాణం చేయాలని గ్రామస్థులు కోరుతున్నట్టు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు ముఖ్యమంత్రి కార్యదర్శి రాజమౌళిని కూడా కలిశారు. పేరూరు ప్రాజెక్టు కాలువ కోసం భూములు ఇచ్చిన రైతులకు పరిహారం మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే భూములిచ్చి రైతులు చాలా ఏళ్లుగా పరిహారం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రైతులు ఎంతో మంచి మనసుతో ప్రాజెక్టు కోసం భూములిచ్చారని.. వారికి పరిహారం ఇవ్వడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జల వనరుల శాఖ మంత్రి కార్యాలయ సిబ్బందిని కలిసి పేరూరు ప్రాజెక్ట్ మరమ్మతులు, కాలువ, ప్రాజెక్ట్ పనులను చేపట్టాలని వినతి పత్రం అందజేశారు. మరోవైపు మంత్రి అనగాని సత్యప్రసాద్ ని కలిసి పలు



అంశాలపై వినతి పత్రం ఇచ్చారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండల రెవెన్యూ అధికారి కార్యాలయాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయాలు నిర్మాణం చాలా రోజుల నుంచి పెండింగ్ లో ఉందన్నారు. దీని వలన ప్రజలకు అసౌకర్యం కలుగుతోందన్నారు. నూతన కార్యాలయాల నిర్మాణాలకు నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై మంత్రి అనగాని సానుకూలంగా స్పందించారు. కార్యాలయాల్ని త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. నియోజకవర్గంలో రెవెన్యూ అధికారుల పనితీరుపై కూడా ఫిర్యాదు చేశారు. సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు విఫలమవుతున్నారని దీనిపై దృష్టి సారించాల్సిందిగా కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఓ.ఎస్.డి. వెంకటకృష్ణను కూడా ఎమ్మెల్యే సునీత కలిశారు. ఏ.నారాయణపురం పంచాయతీ నుంచి పాపంపేట ను ప్రత్యేక పంచాయతీగా విభజించాలని కోరారు. ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని ఓ.ఎస్.డి. తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులు మరియు ఎల్ఓసి లకు సంబంధించిన అంశాలపై చర్చించారు..

## ధర్మవరంలో ఈ నెల 21న హిందూ సమ్మేళనం - ఇంటింటా ఆహ్వానం



**అంకుశం న్యూస్ ధర్మవరం, డిసెంబర్ 19:** ఈ నెల 21వ తేదీన ధర్మవరం కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న హిందూ సమ్మేళనానికి హిందూ బంధువులంతా పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరుతూ ధర్మవరం పట్టణంలోని ఎనిమిదో వార్డులో ఇంటింటా ఆహ్వాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు పాల్గొని ప్రజలను స్వయంగా కలిసి హిందూ సమ్మేళనానికి హాజరుకావాలని ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, హిందువులను సంఘటితం చేసి సమాజంలో సమరసతను పెంపొందించేందుకు, స్వదేశీ భావనను బలపరచేందుకు, కుటుంబ విలువలను కాపాడేందుకు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు అలాగే పౌరుడిగా ప్రతి ఒక్కరి బాధ్యతను గుర్తుచేసే ఉద్దేశంతో ఈ హిందూ సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. 'మార్పు నా నుంచి - నా ఇంటి నుంచే ప్రారంభమైతే, అదే మార్పు సమాజం మొత్తాన్ని, దేశాన్ని ముందుకు నడిపిస్తుంది. మన పవిత్ర మాతృభూమిని తిరిగి విశ్వగురు స్థాయికి తీసుకెళ్లే దిశగా ఈ హిందూ సమ్మేళనం కీలకంగా నిలుస్తుంది' అని ఆయన పేర్కొన్నారు. కావున ధర్మవరంలో జరగనున్న ఈ హిందూ సమ్మేళనం సమాజ ఐక్యతకు, హిందూ ధర్మ విలువల పరిరక్షణకు, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే వేదికగా నిలవనుందని హరీష్ బాబు తెలిపారు. కుల-వర్ణాలకు అతీతంగా పిల్లలు, యువత, మహిళలు, కుటుంబ సభ్యులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## బంగ్లాదేశ్‌లో అదుపు తప్పుతున్న పరిస్థితులు...

పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాడికల్ సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో దేశవ్యాప్తంగా హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రిటన్ తమ దేశ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. అప్రమత్తంగా ఉండాలని, పెద్ద సభలు, ప్రదర్శనలకు దూరంగా ఉండా లని సూచించాయి. తీవ్ర గాయాలతో సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న హాదీ, ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం కన్నుమూశాడు. ఈ విషయాన్ని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ గురువారం రాత్రి అధికారికంగా ధృవీకరించారు. హాదీ మృతదేహం శుక్రవారం సాయంత్రం ఢాకాకు చేరుకోనుందని, శనివారం జాతీయ పార్లమెంట్ భవనం ముందు అంత్యక్రియల ప్రార్థనలు జరిగే అవకాశం ఉందని ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ఈ కారణంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు, ప్రదర్శనలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. శాంతియుతంగా తలపెట్టిన కార్యక్రమాలు కూడా హింసాత్మకంగా మారవచ్చని, కాబట్టి అమెరికా పౌరులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. బ్రిటన్ విదేశాంగ కార్యాలయం కూడా తమ పౌరులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా హింసాత్మక ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న చిట్టగాంగ్ కొండ ప్రాంతాలకు వెళ్లవద్దని స్పష్టం చేసింది. అటు, హాదీ మృతికి సంతాపంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం శనివారం (డిసెంబర్ 20) జాతీయ సంతాప దినంగా ప్రకటించింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని నివేదికలు వస్తున్నాయి.


## తమిళనాడులో ముసాయిదా 'సర్' ఓటర్ల జాబితా ప్రచురణ..

**చెన్నై:** తమిళనాడులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఆ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 97 లక్షల మంది ఓటర్లను తొలగించారు. 66,44,881 మంది ఓటర్లు బదిలీ అయినట్లుగా, 3,39,278 మంది ఓటర్లు పలు ప్రదేశాల్లో నమోదు చేసుకున్నట్లుగా, 26,94,672 మంది ఓటర్లు మరణించినట్లుగా జాబితాలో పేర్కొన్నారు. కాగా, 2025 అక్టోబర్ 27 నాటికి తమిళనాడులో 6.41 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే 'సర్' ప్రక్రియలో 97 లక్షల మందికిపైగా ఓటర్లను తొలగించడంతో ప్రస్తుతం 5.43 కోట్ల మంది ఓటర్లు మిగిలారు. వీరిలో 2.66 కోట్ల మంది పురుషులు, 2.77 కోట్ల మంది మహిళలు, 7,191 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. మరోవైపు 'సర్' ప్రక్రియలో భాగంగా రాజధాని చెన్నైలో అత్యధికంగా 14.25 లక్షల మంది ఓటర్లను తొలగించారు. దీంతో చెన్నై ఓటర్ల సంఖ్య 40.04 లక్షల నుంచి 25.79 లక్షలకు తగ్గింది. 12.22 లక్షల మంది ఓటర్లు బదిలీ అయినట్లు, 1.56 లక్షల మంది మరణించినట్లు, 27,323 మంది ఓటర్లు చిరునామాలో కనిపించలేదని, 18,772 ద్వంద్వ ఓటింగ్ కేసులు ఉన్నట్లు ముసాయిదా ఓటర్ జాబితాలో పేర్కొన్నారు. కాగా, కోయంబత్తూరులో 6.50 లక్షలు, దిండిగల్ జిల్లాలో 2.34 లక్షల మంది ఓటర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కరూర్‌లో 79,690 మంది ఓటర్లను, కాంచీపురం జిల్లాలో 2.74 లక్షల మంది ఓటర్లను తొలగించారు. మరోవైపు షోలింగనల్లూరు, పల్లవరం నియోజకవర్గాల్లో అత్యధిక సంఖ్యలో ఓటర్ల తొలగింపు నమోదైనట్లు తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారిణి అర్చన పట్నాయక్ తెలిపారు. కొన్ని వర్గాల ఓటర్లను తొలగించినట్లుగా వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. ఏ ఓటరు పేరును ఏకపక్షంగా తొలగించలేదని మీడియాతో అన్నారు.

## ఈడీ దూకుడు

అక్రమ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా భారత మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్పతో పాటు ప్రముఖ నటుడు సోనూ సూద్, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో నటి నేహా శర్మ, మోడల్ ఊర్వశీ రౌతేలా తల్లి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రాల ఆస్తులు కూడా ఉన్నాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జప్తు చేసిన ఆస్తుల్లో యువరాజ్ సింగ్‌కు చెందిన రూ.2.5 కోట్లు, సోనూ సూద్‌కు చెందిన రూ.1 కోటి, మిమీ చక్రవర్తికి చెందిన రూ.59 లక్షలు, నేహా శర్మకు చెందిన రూ.1.26 కోట్లు, రాబిన్ ఊతప్పకు చెందిన రూ.8.26 లక్షలు, ఊర్వశీ రౌతేలా తల్లికి చెందిన రూ.2.02 కోట్ల ఆస్తులు ఉన్నాయి. విదేశాల్లో రిజిస్టర్ అయిన '1×బెట్' అనే అక్రమ బెట్టింగ్ యాప్ ద్వారా రూ.1000 కోట్లకు పైగా మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో గతంలోనే ఈ సెలబ్రిటీలందరినీ

## నిరుద్యోగ యువతీ యువకులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ



**అంకుశం న్యూస్ ప్రకాశం: డిసెంబర్ 19:** ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 24 నుండి 30వరకు 7 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం స్థలం బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ ఆశ్రమం సెంటర్ లో కనకపూర్ రోడ్ హ ృదయపుర వయా బనశంకరి నందు నిరుద్యోగ యువతి యువకులకు నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఉంటుందని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘసేవకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు 18 సంవత్సరాలు పైబడి 35 సంవత్సరంలోపల వయస్సు గల యువతి యువకులు పాల్గొనవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు 10వ తరగతి పాసయి ఆపై తరగతులు డిగ్రీ పీజీ వారు పాల్గొనవచ్చును. శిక్షణలో పాల్గొనే వారికి రాష్ట్ర కోఆర్డినేటర్స్ సలహాలు సూచనలు ఇవ్వబడును. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ వై టి రంగనాథ్ పాల్గొని శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణలో పాల్గొనే యువతి యువకులకు గ్రామీణాభివ ృద్ధి పై వ్యక్తిత్వ వికాసం నాయకత్వ లక్షణాలపై ఆర్థిక అభివ ృద్ధిలో ఎదుగుదల ఆరోగ్య చిట్కాలు యుక్తి ముక్తి భుక్తి పై శిక్షణ ఉంటుంది దీనితోపాటు గో ఆధారిత వ్యవసాయం గురించి సూచనలు సలహాలు ఇవ్వబడును. యోగాసనాలతో ఒత్తిడి లేని జీవితం తదితర అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణలో నైపుణ్యత సాధించిన వారికి బతుకుతెరువు కోసం వేరు వేరు శిక్షణలు కూడా ఉంటాయన్నారు. శిక్షణ అనంతరం మ్యానువల్ తో పాటు సర్టిఫికెట్ కూడా ఇస్తారు. ఈ శిక్షణలో పాల్గొనాలనే వారు డిసెంబర్ 23 సాయంత్రం బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమం సెంటర్ కు చేరుకోవాలన్నారు. 7 రోజుల శిక్షణకు సరిపడు లూజు దుస్తులు వెంట తెచ్చుకోవాలన్నారు. ఆసక్తి గల యువతి యువకులు 9441932390 నెంబర్ ను సంప్రదించాలని బి యస్ నారాయణరెడ్డి కోరారు.

## టీటీడీకి రూ.20 లక్షలు విరాళం

**అంకుశం న్యూస్ తిరుపతి డిసెంబర్ 19:** హైదరాబాద్ కు చెందిన శ్రీ హిమశ్రియ దంతు అనే భక్తురాలు టీటీడీ స్విమ్స్ ట్రస్టుకు శుక్రవారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. అదేవిధంగా ఫ్లాష్ లైన్ ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీవేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించింది. ఈ మేరకు వారి ప్రతినిధి కుప్పాల నీలేష్ కుమార్ తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీలను అందజేశారు.

## పదవ తరగతి విద్యార్థులకు మోడల్ పేపర్స్ మెటీరియల్ పంపిణీ....




**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 19:** ధర్మవరం బెస్త సేవా డెవలప్మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమం లో శివానగర్ బి ఎస్ ఆర్ స్కూల్లో పదవ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులకు మోడల్ పేపర్స్ మెటీరియల్ సత్య సాయి జిల్లా బెస్త సేవా డెవలప్ మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 198 మందికి ట్రస్ట్ చైర్మన్ దత్త శివ అందజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ బెస్త శ్రీ నివాసులు, ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు జి ఆర్ రామ్ మోహన్, ఓబుళపతి, టీడీపీ వార్డు ఇంచార్జి సదా శివ, ట్రెజరర్ విజయకుమార్, బి ఎస్ ఆర్ హైస్కూల్ హెడ్ మాస్టర్ మేరీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ దత్త శివ మాట్లాడుతూ, తమ సంఘం తరుపున ఎస్ ఎస్ సి చదివే విద్యార్థులకు అందరికీ 198 మందికి మోడల్ పేపర్స్ అందజేశామని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ ఉత్తమ ఫలితాలలో ప్రధమ శ్రేణి వారికి నగదు బహుమతి ఇచ్చి ప్రోత్సాహం అందిస్తామన్నారు.

## హత్య కేసులో ప్రతిభ




**- అనకాపల్లి పోలీసులకు 'ఏబీసీడీ' అవార్డు**

**- అభినందించిన డీజీపీ హరీష్ కుమార్ గుప్తా**

**(అంకుశం, అనకాపల్లి, డిసెంబర్ 19):** అనకాపల్లి జిల్లా పోలీసులు శాస్త్రీయ ఆధారాలు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఒక క్లిష్టమైన హత్య కేసును తక్కువ సమయంలో ఛేదించినందుకు గాను అనకాపల్లి జిల్లా పోలీసు అధికారులకు ఏబీసీడీ (అవార్డ్ ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్) అవార్డు లభించింది. జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో ఈ కేసు కొలిక్కి వచ్చింది. కేసు వివరాలు ఇలా.. గత ఆగస్టు 14వ తేదీన సబ్బవరం మండలం, బాటాజంగాలపాలెం వద్ద గుర్తుతెలియని మహిళా మతదేహం సగం కాలిన స్థితిలో లభించింది. మతురాలి వివరాలు గానీ, నిందితుల ఆనవాళ్లు గానీ లేని ఈ 'బ్లైండ్ మర్డర్' కేసు పోలీసులకు పెద్ద సవాలుగా మారింది. ఈ కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన ఈ క్రింది అధికారులకు అవార్డులు ప్రకటించారు. తుహిన్ సిన్హా ఐపీఎస్ ఎస్పీ అనకాపల్లి జిల్లా, వి.విష్ణు స్వరూప్, ఎస్.డి.పి.ఓ, పరవాడ, జి.రామచంద్రరావు, ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, సబ్బవరం, పి.సింహాచలం, సబ్ ఇన్స్పెక్టర్, సబ్బవరం, పి.ప్రసాదరావు, సబ్ ఇన్స్పెక్టర్, మునగపాక, టి.రమేష్, ఇన్స్పెక్టర్, (టాస్క్ ఫోర్స్). కేసును ఛేదించిన తీరు: పోలీస్ బందం దాదాపు 14,000 కు పైగా మొబైల్ నంబర్లను (టవర్ డంప్), 450 కి పైగా ,,F V కెమెరాలను, మరియు 1,000 కి పైగా వాహనాల సమాచారాన్ని విశ్లేషించింది. చివరకు పెట్రోల్ బంక్ వద్ద లభించిన దశ్యాలు, నిందితుడు మురళీధర్ రెడ్డి వాడిన స్విఫ్ట్ డిజైర్ కారు ఆధారంగా నిందితులను గుర్తించారు. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాల కారణంగా మతురాలు బాంకిల సంతు రెడ్డిని ఆమె బావ అయిన మురళీధర్ రెడ్డి (ఏ1), మతురాలి కుమార్తెలు అనుష (ఏ2), అదితిలతో కలిసి హత్య చేసినట్లు విచారణలో తేలింది. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

# అనంతపురం జిల్లా పోలీసులకు ప్రతిష్టాత్మక రాష్ట్ర స్థాయి అవార్డు.....

**– డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా జిల్లా ఎస్పీ జగదీష్ కు అవార్డు**

**అంకుశం క్రైమ్ న్యూస్ అనంతపురం డిసెంబర్ 19:** అనంతపురం జిల్లా పోలీసులకు మరో అరుదైన గౌరవం దక్కింది ఇటీవల కాలంలో అనేక కేసులను చేదించిన అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ నాయకత్వంలో జిల్లా పోలీసులు చేసిన అద్భుత పనితీరుకు నిదర్శనగా రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త చేతుల మీదుగా జిల్లా పోలీసులకు అవార్డు దక్కింది రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా శుక్రవారం మంగళగిరి పోలీసు ప్రధాన కార్యాలయంలో ఈ అవార్డును అనంతపురం రేంజ్ డిఐజి షిమూషి సమక్షంలో అందుకున్న జిల్లా ఎస్పీ పి.జగదీష్ సారథ్యంలో రాయదుర్గం యు.పి.ఎస్ , రాయదుర్గం రూరల్ & జిల్లా సైబర్ విభాగం పోలీసులు కాంబోడియా దేశం నుండీ ఫేక్ యాప్ ల ఆపరేట్ చేస్తూ ఢిల్లీ కేంద్రంగా ఫ్రాడ్ డబ్బును భారీగా ఫేక్ అకౌంట్లలోకి బదలాయించిన గుట్టు రట్టును చేసిన జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆధ్వర్యంలో రాయదుర్గం యు.పి.ఎస్ , రాయదుర్గం రూరల్ & జిల్లా సైబర్ విభాగం పోలీసులులి రాయదుర్గం మండలం వేపరాళ్లకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ నరసింహప్ప18-06-25 న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు కేసు Cr.No.112/2025, U/s 318(4) BNS and Sec 66 (D) of IT Act నమోదు చేశారు.




జిల్లా ఎస్పీ పి.జగదీష్ పర్యవేక్షణలో కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు ఆధ్వర్యంలో సి.ఐ లు జయనాయక్, వెంకటరమణ, షేక్ జాకీర్ , ఎస్సైలు నాగమధు, గుర్నాథరెడ్డిల సారథ్యంలో పోలీసు బృందాలు రంగంలోకి దిగాయి. 01-08-2025 తేదీన ఐదుగురు సభ్యులు గల ముఠాను అరెస్టు చేసి...రూ. 41.20 లక్షల నగదు, 08 సెల్ ఫోన్ లు, కారు, 20 ఏటిఎం కార్డ్స్, 15 సిమ్ కార్డ్స్, 05 బ్యాంక్ పాస్ బుక్కులు, 10 చెక్కు బుక్కులు, 02 రూటర్స్ స్వాధీనం చేసుకున్నారు. దేశ వ్యాప్తంగా క్రియేట్ చేసిన 13 ఫేక్ అకౌంట్లలోకి సదరు డబ్బు వెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడయ్యింది
ఢిల్లీ కేంద్రంగా ఫేక్ అకౌంట్ల ద్వారా పలు అకౌంట్లలోకి ఫ్రాడ్ చేసిన డబ్బు మార్పిడి చేశారు. క్రిప్టో కరెన్సీ ద్వారా దేశం దాటించేందుకు సిద్ధమైన సమయంలో కరెక్ట్ టైంలో గుట్టురట్టు చేశారు ఇలాంటి కేసులను పరిష్కరించినప్పుడే



ప్రజల్లో గౌరవం పెంపొందుతుంది.... ఈ అవార్డును స్ఫూర్తి గా తీసుకుని జిల్లా పోలీసులు మరిన్ని కేసులను సమర్థవంతంగా, సమిష్టిగా ఛేదిద్దామని పిలుపునిచ్చిన జిల్లా ఎస్పీ జగదీష్. రాష్ట్ర వ్యాప్తంగా కీలక కేసుల దర్యాప్తుల్లో అత్యంత ప్రతిభ కనపరచడాన్ని గుర్తించి ప్రతిష్టాత్మకంగా ప్రతీ మూన్నెళ్లకు ఒకసారి ప్రకటించే ఏబిసిడి ( అవార్డు ఫర్ బెస్ట్ క్రైం డిటెక్షన్ ) అవార్డు జిల్లాకు దక్కడం... అందునా రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త చేతుల మీదుగా అవార్డు అందుకోవడం విశేషంలిఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ మధుసూదన్ రెడ్డి రవిశంకర్ అయ్యర్ సీనియర్ ఐపీఎస్ అధికారివిజయవాడ సిపి రాజశేఖర్ బాబు ఐజీలు రవి ప్రకాష్ సత్య ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు

# మెడికల్ కళాశాలల్ని ఎందుకు పూర్తి చేయలేదు

**– సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా పరిటాల శ్రీరామ్**

**– 7మందికి రూ.4.79లక్షల చెక్కులు అందజేసిన శ్రీరామ్**

**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 19:** మెడికల్ కళాశాలల విషయంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మడం లేదని.. ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 7మందికి 4లక్షల 79వేల రూపాయల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, లబ్ధిదారుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు. చెక్కులు అందుకున్న వారు ముఖ్యమంత్రి చంద్రబాబుకు, పరిటాల శ్రీరామ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ



ఎన్టీఆర్ వైద్య సేవలు అందక ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం కోసం భారీగా ఖర్చులు పెట్టుకున్న వారికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. వైద్యం విషయంలో ఎవరూ ఇబ్బంది పడకూడదన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్దేశ్యం అన్నారు. ఇందుకోసం ఎన్టీఆర్ వైద్య సేవల్ని విస్తృతం చేయడంతోపాటు మెడికల్ కళాశాలల్ని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. అయితే పీపీపీ మోడల్ అంటే ప్రైవేట్ పరం అన్నట్టుగా వైసీపీ నాయకులు



అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీకి అంత చిత్తశుద్ధి ఉంటే వారి ప్రభుత్వ హయాంలో ఎందుకు వాటిని పూర్తి చేయలేదని నిలదీశారు. వైద్యం, వైద్య విద్య అందరికీ అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని... వైసీపీ ఫేక్ ప్రచారాలను ఎవరూ నమ్మరని శ్రీరామ్ స్పష్టం చేశారు...

# ఏపీకి ఎబి-పి.ఎమ్.జె.ఎ.వై పథకం విడుదల నిధులు

**– ఈ పథకం కింద క్లెయిమ్‌ల చెల్లింపులు నిరంతర ప్రక్రియ**

**– కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ వెల్లడి**

**– ఎబి-పి.ఎమ్.జె.ఎ.వై పథకం కింద ఎంప్యానెల్ చేసిన ఆసుపత్రులపై ప్రశ్నించి ఎంపీలు కేశినేని శివనాథ్,**

**అంకుశం ప్రతినిధి విజయవాడ డిసెంబర్ 19:** ఆయుష్మాన్ భారత్-ప్రధాన్ మంత్రి జన ఆరోగ్య యోజన (AB-PMJAY) పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు 2020-21 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరాల వరకు మొత్తం రూ. 1,965.65 కోట్ల నిధులు విడుదల చేసిందని కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ వెల్లడించారు. లోక్ సభలో శుక్రవారం ఎంపీలు కేశినేని శివనాథ్, బస్తీపాటి నాగరాజు కలిసి ఎబి-పి.ఎమ్.జె.ఎ.వై పథకం కింద ఎంప్యానెల్‌మెంట్, ఆయుష్మాన్ కార్డుల పంపిణీ, నిధుల విడుదల తదితర అంశాలపై కేంద్ర ఆరోగ్య , కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖను ప్రశ్నించగా, ఆ శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాధవ్ లిఖిత పూర్వకంగా బదులిచ్చారు.

ఆయుష్మాన్ భారత్ - ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (AB-PMJAY) కింద ఎంప్యానెల్ చేసిన ప్రభుత్వ , ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలు, రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా, జిల్లాల వారీగా ఆన్ లైన్ లో ప్రజలకు అందుబాటులో పెట్టినట్లు తెలిపారు. అలాగే దేశంలోని రాష్ట్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో సహా జిల్లాల వారీగా ఆయుష్మాన్ కార్డులకు సంబంధించిన పూర్తి



(అభ్యర్థించినవి, ఆమోదించినవి, పంపిణీ చేసినవి, పెండింగ్‌లో ఉన్నవి) వివరాలు కూడా ఆన్ లైన్ లో ప్రజలకు అందుబాటులో వుంచినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకమైన ఆయుష్మాన్ భారత్ - ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (AB-PMJAY) పథకం నిధులు కేంద్ర-రాష్ట్రాలు పంచబడతాయన్నారు. కేంద్రం-రాష్ట్రం మధ్య నిధులు పంచబడుతున్నాయని తెలిపారు. డిమాండ్ ఆధారిత పథకమైన ఈ పథకానికి సంబంధించి. గతంలో విడుదల చేసిన నిధుల వినియోగ ధ్రువపత్రాలు (Utilization Certificates) రాష్ట్రాల నుండి వచ్చిన అవసరాల ఆధారంగా భారత ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుందన్నారు.
ఈశాన్య రాష్ట్రాలు, హిమాలయ రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు (జమ్మూ & కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్) ఈ పథకానికి సంబంధించి కేంద్ర రాష్ట్రాల వాటా 90:10 గా వుండగా, శాసనసభ లేని కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర వాటా 100%., మిగిలిన రాష్ట్రాల్లో కేంద్ర రాష్ట్రాల 60:40 గా వుందని వివరించారు. ఈ పథకం కింద ఆసుపత్రులకు క్లెయిమ్‌ల చెల్లింపులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతున్నాయని, రాష్ట్రంలోని ఆసుపత్రుల క్లెయిమ్‌లు 15 రోజుల్లోపు, ఇతర రాష్ట్రాల్లో చికిత్స పొందిన కేసుల క్లెయిమ్‌లు 30 రోజుల్లోపు పరిష్కరించేందుకు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని స్పష్టం చేశారు.

# బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడితో బీజేపి నేత విష్ణు మర్యాదపూర్వక సమావేశం

**అంకుశం న్యూస్ అనంతపురం డిసెంబర్ 19:** బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నితిన్ నబీన్ సిన్హా ని నేడు న్యూఢిల్లీలో కలుసుకుని అభినందనలు తెలియజేయడం జరిగిందని ఆ పార్టీ నేత యస్. విష్ణువర్ధన్ రెడ్డి ఢిల్లీలో మీడియా ప్రతినిధులకు తెలిపారు. కేవలం 45 ఏళ్ల వయసులోనే పార్టీలో అగ్రస్థానానికి ఎదిగి, పార్టీ చరిత్రలో అత్యంత పిన్నవయస్కుడిగా నిలిచిన నితిన్ నబీన్ గారి నియామకం , వారి నాయకత్వ లక్షణాలు దేశంలో యువతకు గొప్ప ప్రేరణగా నిలుస్తోందన్నారు. ఇలా అర్హులైన నేతలను గుర్తించడం ఒక్క భారతీయ జనతా పార్టీ మాత్రమే సాధ్యమని అన్నారు . అర్హత, విలువలు, నాయకత్వ లక్షణాలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీ వ్యవస్థకు ఇది ప్రత్యక్ష నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా, భారతీయ జనతా యువ మోర్చాలో గతంలో నితిన్ నబీన్ తో కలిసి




పనిచేసిన అనుభవాలను ఇరువురూ స్మరించుకుని పంచుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. భారతీయ జనతా పార్టీలో సిద్ధాంతం, క్రమశిక్షణ, నిజాయితీ, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు జాతీయ స్థాయి ఎదుగుదలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, నితిన్ నబీన్ ఎదుగుదల దీనికి బలమైన సాక్ష్యమని విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు.బీజేపీ ప్రతి స్థాయిలో ప్రతిభ ఆధారంగా కొత్త నాయకత్వాన్ని తీర్చిదిద్దుతూ, గతంలో కూడా అనేక మందిని దేశానికి అందించిన ఘనత బీజేపి జాతీయ నాయకత్వానికి ఉందని కొనియాడారు. యువ నాయకులను గుర్తించే ప్రక్రియ ద్వారా దేశ రాజకీయ వ్యవస్థకు చక్కటి మార్గదర్శకమని తెలిపారు. దేశ రాజకీయ రంగంలో ఇలాంటి నాయకత్వ మార్పులు బాధ్యతాయుత, ఆదర్శవంతమైన రాజకీయ కార్యకలాపాలకు ఈ నిర్ణయాలు దారితీస్తాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ నాయకత్వం తీసుకున్న నిర్ణయం పార్టీని మరింత బలంగా ముందుకు తీసుకెళ్తుందని నమ్ముతున్నామని, కేంద్ర నాయకత్వానికి , పార్లమెంటరీ పార్టీకి విష్ణు వర్ధన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## సమస్యలు పరిష్కరిస్తా.. అవినీతి లేకుండా పని చేయండి


**– వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లను కోరిన మంత్రి అనగాని**



**(అంకుశం, అమరావతి, డిసెంబర్ 19):** సమస్యలన్నీ పరిష్కరిస్తా.. అయితే అవినీతికి ఆస్కారం లేకుండా పని చేయాలని వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లను రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రపదేశ్ వీఆర్వో అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వి.ఆర్.ఎ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, ఏపీ గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్ కు వివరించారు. తమకు ప్రమోషన్లు ఇవ్వాలని మూడు సంఘాల వారు కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి అనగాని హామీ ఇచ్చారు. వీఆర్వో అసోసియేషన్ నాయకులు రవీంద్ర మాట్లాడుతూ తమకు రోజూ గ్రామ సచివాలయాల కెళ్లి హాజరు వేయించుకోవడం సమస్యగా ఉందని, తాము ఎక్కడ పనిలో ఉంటే అక్కడ నుండే హాజరు వేసే విధంగా వెసులుబాటు కల్పించాలని కోరారు. అదే విధంగా రెవిన్యూ శాఖ విధుల్లో ఉన్నప్పుడు కూడా వేరే విధులు కూడా చేయాలని గ్రామ సచివాలయాల అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, దీని వల్ల రెవెన్యూ శాఖ పనిని సరిగ్గా చేయలేకపోతున్నామని తెలిపారు. తమకు గ్రామ సచివాలయాల్లో ఒక కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తే ఇక ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే రోజువారీ విధులు నిర్వహిస్తామని కోరారు. సర్వేయర్ల అసోయేషన్ నాయకులు మాట్లాడుతూ తమను టెక్నికల్ పోస్టులుగా గుర్తించాలని కోరారు.

## ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహించే ‘సుశాసన్ సప్తాహ్-ప్రశాసన్ గావ్ కీ ఓర్’ కార్యక్రమము

**– జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్**



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, డిసెంబరు 19:** జిల్లాలో ఈ నెల 19 నుంచి 25 వరకు నిర్వహించే ‘సుశాసన్ సప్తాహ్ – ప్రశాసన్ గావ్ కీ ఓర్’ కార్యక్రమాన్నిసమర్థవంతంగా, లక్ష్య సాధనతో అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు జిల్లా కలెక్టర్ ఏ. శ్యాం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు & ప్రజా ఫిర్యాదుల శాఖ (DARPG) ఆధ్వర్యంలో.. డిసెంబరు 19 నుంచి 25, 2025 వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం ద్వారా సుపరిపాలన, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, ప్రజలకు మెరుగైన సేవల అందింపు లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. అమలు దశలో (Implementation Phase) భాగంగా, తహసీల్ కేంద్రాలు, పంచాయతీ సమితులు తదితర ప్రాంతాలలో ప్రత్యేక ప్రజా ఫిర్యాదు పరిష్కార శిబిరాలు నిర్వహించి ప్రత్యేక క్యాంపుల్లో పరిష్కరించిన ఫిర్యాదులు, పరిష్కరించిన సేవల దరఖాస్తులు, ప్రచార, అవగాహన వర్క్‌షాప్ వివరాలు ప్రతిరోజూ ‘ప్రశాసన్ గావ్ కీ ఓర్’ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ ప్రకటనలో స్పష్టం చేశారు. అలాగే డిసెంబరు 23, 2025న జిల్లా స్థాయిలో ప్రచార-అవగాహన వర్క్‌షాప్ నిర్వహించి, జిల్లాలో అమలవుతున్న మంచి పరిపాలనా విధానాలను సేకరించి పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత దగ్గరగా చేరాలని, ప్రజా సంతృప్తి స్థాయి పెరిగేలా అధికారులు బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు .

## స్కూల్ గేమ్స్ అండర్ - 17 అంతర్ జిల్లాల క్రికెట్ చాంపియన్ విశాఖపట్నం

**– రెండోస్థానంలో శ్రీకాకుళం, మూడోస్థానంలో గుంటూరు జట్టు**

**– విజేతలకు ట్రోఫీలను అందజేసిన వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యదర్శి అండ్ కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణ రెడ్డి**



**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధివిజయవాడ డిసెంబర్ 19:** ఎన్‌టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఇక్కడి గ్రీన్ ఫీల్డ్స్ మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్ - 17 బాలుర క్రికెట్ చాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం జిల్లా జట్టు కైవసం చేసుకుంది. ఈ జట్టు వరుసగా మూడో ఏడాది కూడా టైటిల్‌ను గెలుచుకుని హ్యాట్రిక్‌ను సొంతం చేసుకుంది. ఫైనల్ మ్యాచ్‌లో విశాఖ జట్టు పట్టుదలగా పోరాడిన శ్రీకాకుళం జట్టుపై 21 పరుగుల తేడాతో విజయం సాధించి, ప్రతిష్టాత్మకమైన హ్యాట్రిక్ టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఈ మూడు రోజుల ఛాంపియన్‌షిప్‌ను ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నున్నలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్వహించింది. మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో శుక్రవారం ముగిసింది. , టైటిల్ పోరులో విశాఖపట్నం టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత ఓవర్లలో ఆ జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 92 పరుగులు చేసింది. కెప్టెన్ అవినాష్ ముందుండి నడిపించి, వేగవంతమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 19 బంతుల్లోనే ఆరు ఫోర్లు, ఒక భారీ సిక్సర్‌తో సహా 39 పరుగులు చేసి, వైజాగ్ ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చాడు. శ్రీకాకుళం బౌలర్ సాహిల్ క్రమశిక్షణతో బౌలింగ్ చేసి, రెండు కీలక వికెట్లు తీసి, పరుగుల ప్రవాహాన్ని నియంత్రించాడు. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో, శ్రీకాకుళం జట్టు విశాఖపట్నం బౌలర్ల క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో ఇబ్బంది పడి, ఆరు వికెట్ల నష్టానికి 71 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ జోగేంద్ర 22 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు, కానీ మిగిలిన బ్యాట్స్‌మెన్ ఒత్తిడిలో భాగస్వామ్యాలను నిర్మించడంలో విఫలమయ్యారు. విశాఖపట్నం బౌలర్లు శ్రీ రామాంజనేయులు మరియు సాకేత్ అద్భుతంగా రాణించి, చెరో రెండు వికెట్లు తీసి తమ జట్టుకు సునాయాస విజయాన్ని అందించారు. టోర్నమెంట్ ముగింపు సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ (వీజీటీఎన్) కార్యదర్శి మరియు కరస్పాండెంట్ నరెడ్ల సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఛాంపియన్స్ విశాఖపట్నం, రన్నరప్ శ్రీకాకుళం మరియు మూడవ స్థానంలో నిలిచిన తూర్పు గోదావరి జిల్లాకు ట్రోఫీలను అందజేశారు. వీజీటీఎన్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్. గోపాలకృష్ణ, టోర్నమెంట్ పరిశీలకుడు భూపాల్ రెడ్డి, స్కూల్ గేమ్స్ ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి టి శ్రీ లత, కృష్ణా జిల్లా కార్యదర్శి గంప రాంబాబు మరియు ఎంపిక కమిటీ సభ్యులు వ్యక్తిగత పతకాలను పంపిణీ చ

## ధర్మవరంలో15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తాం

**– ప్రజా దర్బార్ కార్యక్రమంలో ధర్మవరం తెదేపా ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్**

**– పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్.. వినతులు స్వీకరించిన శ్రీరామ్**





**అంకుశం న్యూస్ ధర్మవరం డిసెంబర్ 19:** 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నియోజవర్గంలో అవసరం ఉన్న చోట సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాలని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టణం ఎర్రగుంట సర్కిల్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు శ్రీరామ్ కు తమ సమస్యలు చెప్పుకుని అర్జీలు ఇచ్చారు. ప్రతి ఒక్కరితో ఆయన ఓపిగ్గా మాట్లాడి సమస్యలు ఉన్నారు. ముఖ్యంగా ధర్మవరం పట్టణం, రూరల్ ప్రాంతాల్లో రెవెన్యూ సమస్యలను శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. కొంతమంది వ్యక్తిగత సమస్యలను కూడా వినతుల రూపంలో పరిటాల శ్రీరామ్ కు అందజేశారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారమయ్యేలా అధికారులతో మాట్లాడారు. మరికొన్నింటికి నిర్ణీత గడువులోగా పరిష్కారమయ్యే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీల్లో సిసి రోడ్లు, సీసీ డ్రైన్స్ సమస్య అధికంగా ఉందని కొందరు కార్యకర్తలు చెప్పగా.. 15 వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా యుద్ధ ప్రాతిపదికన వాటిని నిర్మించేలా చూస్తామన్నారు. అత్యవసరమున్న కాలనీల్లో కొత్తగా డ్రైనేజీలు కూడా నిర్మిస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులతో శ్రీరామ్ వ్యక్తిగతంగా మాట్లాడుతూ వారి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ ప్రజాక్షేత్రంలోనే ఉండాలని ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా దర్బార్ లో ప్రజలు ఇచ్చిన వినితులన్నింటిని సంబంధిత అధికారులకు అందజేస్తామని.. సమస్యల పరిష్కారంలో ఎక్కడా రాజీ ఉండదని శ్రీరామ్ స్పష్టం చేశారు...